# సంధ్యా సమస్యలు

దాడి సుజాత

స్కెచ్

పండంటి చంటాడిని వొడిలో ఉంచుకొని వీధివాకిట తలుపులు వోరగ తెరుచుకొని కూర్చునుంది బుజ్జమ్మ....రోజూ అలా సాయం సమయంలో గతి తప్పక ఆచరించే బుజ్జమ్మ యొక్క సదరు కార్యక్రమోద్దేశం ఎవరికీ అర్థంకానిమాట అలాఉంచి అసలు బుజ్జమ్మకే తెలియదు....సాధారణంగా కొంతమంది మనుషులు చేసే కొన్ని పనుల కసలు అర్థం ఉండదనుకుంటే, వాటిలో ఒకటిగా దీన్ని చేర్చి వెయ్యవచ్చు. పశ్చిమాన దిగ్మండలపు అంచునుండి సూర్యభగవానుడు క్రిందికి జారి పోయే వరకు బుజ్జమ్మ వడిలో బిడ్డతో అక్కడ అలానే కూర్చుంటుంది, ఆ యింటి కోడలుగా కాలుంచిన రెండు సంవత్సరాల నుంచీ. తరుచు వీధివంక చూడ్డం .... మధ్యమధ్య చంటాడిని ముద్దాడ్డం. ఈ రెండు కార్యక్రమాలు ఏదో యాంత్రికంగా జరిగిపోతున్నట్లుంటాయ్. మనస్సు మట్టుకు ఈ చర్యలతో సంబంధం పెట్టుకోక ఎక్కడో పెనుగులాడుతున్నట్లుంటుంది. విషాదసాగర కెరటాలు బుజ్జమ్మ మనస్సును ఢీకొని విరిగి ముక్కలైపోక....సాగర గర్భంలోకి లాక్కుపోతే....ఆ సముద్రపు అట్టడుగున ఉక్కిరి బిక్కిరవుతూ విలవిల తన్నుకుంటుంది బుజ్జమ్మ మనస్సు. కోటి విషాద రేఖలు గజిబిజిగా బుజ్జమ్మ ముఖాన్ని అలుముకుపోతే....ఒక్క క్షణంసేపు కళ్ళముందొక నల్లటి పలక దృష్టిని కప్పివేస్తుంది ఆ పలకమీద ఒకచిత్రం....

....బోసినోటి పాప గాలిలో చేతులు అందని ఆకాశంలోని చందమామ కోసం ఊపుతూ ఉంటుంది.

రెండుసంవత్సరాల క్రితం బుజ్జమ్మ పదహారణాల పడుచుపిల్ల. మొన్నటి బుజ్జమ్మ నిన్న కాపరానికొచ్చి ఈ వేళ పిల్లాడి నెత్తుకుంది. మొన్నటి రోజున పదహారణాల పడుచైన బుజ్జమ్మ ఈ రోజున ఓ చంటివాడికి అమ్మయిపోయింది.

బుజ్జమ్మ ఆలోచనలన్నీ గతంలోని ఓ రోజు వైపుకుపోయి ఆ నాటి బుజ్జమ్మ చిత్రాన్ని పరిశీలిస్తాయ్....ఆ రోజే తన జీవితం విషాదసాగరానికి అంకితం చెయ్యడానికి ఒప్పందంజరిగినరోజు. దానితో ముడిపడి మరికొన్ని గతానికి సంబంధించిన స్మృతులు బిలబిలలాడుతూ బయట బడతాయ్. చెవులమీదుగా జారుతున్న నల్లని నొక్కులజుత్తు....చిఱునవ్వుతో కాపురంచేసే లేజిగురుటాకుల్లాంటి పెదవులు....తెల్లని వాయిల్ లంగామీద ఆకుపచ్చ వోణీ వేసుకొని....ఊదారంగు చోళీతో...నిలువుటద్దంముందు నుంచుంటే....''అబ్బ ఏవిటీ....ఈ వెర్రి సౌందర్యం!''—అనిపించేది తనకే....

అతనికీ అలానే అనిపించి ఉండాలి. వెంటనే తను నచ్చినట్లు తన ఎదురుగుండానే వెల్లడించేశాడు. వెంటనే తన గుండెల్లో బండ రాయి పడినట్లయిపోయింది. దెబ్బతిన్న లేడిలా బెదురుబెదురుగా తలపైకెత్తి ఒక్కసారి చూచింది, అతని

ముఖంలోకి అంతగా బాగుండలేదు. అంత ఆస హ్యంగానూ లేదు. ముతకపంచె, గళ్ళచొక్కా, బుజాన్న ఓ తుండు....కళ్ళు తనవంక ఆశగా చూచాయ్. పెదవులమీద కెందుకో చిఱునవ్వు జరజర ప్రాక్కొచ్చింది....ఆ నాటి అతని రూవు తనకి మనసారా నచ్చలేదు. దానికి కారణా లేవిటో అంతకంటా అంతు చిక్కలేదు తనకి.

''ఇతన్ని చేసుకోను''—అని చెప్పడం తనకి కష్టమైన పనికాదు. ఎందుకు చేసుకో వని అడిగితే....

''ఇందుకూ''—అని ఏ కారణాలు చెప్పాలో అర్థంకాలేదు. అంతవఱకు తనకి తెలియ కుండా తన హృదయాంతరంలో తిష్ఠవేసుకొన్న భయాలేవో ఒక్కుమ్మడిగా విజృంభించి తన లోని ప్రతిఘటనా శక్తిని చంపివేశాయ్....

అంతే! అతనితో పెళ్ళి నిశ్చయమైపోయింది. పంజరంలోకి నెట్టబడ్డ చిలకలా ఐపోయింది తన పని....ఆ నాటి తన మానసికవేదన ఇప్ప టికీ గుర్తే....ఎప్పటికీ మరచిపోలేదు తను. తన కోసం అప్పటికే పడిగాపులు పడుతూ ఇంటిచుట్టూ తచ్చాట్లాడే కుర్రకారు. ఏ మాత్రం ప్రమత్తురాలైఉన్నా బ్రతుకు అల్లరికాక తప్పదు. అప్పుడు తన జీవితం ఏంకాను?....

అక్కడికీ ఆ టైలర్ కుర్రాడితో కాస్త చను వుగా మాటా మంతీ కానిచ్చినందుకు....గుస గుస లాడుకున్న ఘట్టాలు లేకపోలేదు. నిజంగా తనకి మరో దురుద్దేశంలేదు. నవ్వుతూ పేలుతూ, ఉషారుగా మాట్లాడతా డతను.... అతనితో సంభాషణ పెంచడమంటే తన కెంతో సంతోషంగా ఉండేది....అంతే .... దానిమీద వాడకట్టులో తన మీద లేచిన దుమారం, దానికి తను లెక్కచేయకపోయినా దాని పని అది చేసుకుపోతుంది. ఫలితం అనుభవించ వల్సింది తనేగా. పై పెచ్చు పెళ్ళికాని పిల్లంటే అందరికీ చొరవే....ప్రక్కింటి ప్రభాకరం, నిజంగా రూపానికతను మన్మథుడు....బాగా చదువుకున్నవాడు...కాలక్షేపానికని, పత్రికలూ అవీ అతని దగ్గర అడిగి తీసుకుంటే....ఆఖరికి అతను చేసిన పని....ఆ మాట నిజమేననుకో, అతన్ని గురించి ఓ స్పష్టమైన అభిప్రాయం తనకుంది .... ఇన్‌షర్ట్ వేసి, టై కట్టి కూలింగ్ స్పెక్ట్స్ తగిలించి మోటార్ బైక్ మీద పోతూంటే నిజంగా తను అతన్ని చుట్టానికి ఉబలాటపడని రోజుండేదికాదు....అతనిలాంటివాణ్ణి చేసుకొని చిన్న కారులో తిరుగుతూ జీవితాన్ని ఒక ఉత్సాహ పూరితమైన ఓడలా నడిపేయాలని ఏ ఆడదైనా కోరుకోవడం అన్యాయం అధర్మం కాదుగా....కాని అతను ఆ రోజున ఇంట్లో ఎవరూ లేని సమయంలో నేరుగా తన గదిలోకి ప్రవేశించి తనపై అతనికున్న ప్రేమని నివేదిం చేశాడు. నిజంగా అప్పుడు తను పొందిన ఆనందం....కాని మరుక్షణంలోనే అది మాయం కాక తప్పలేదు. దాని స్థానే భీతి, ఆందోళన.... రంభ నీ కాలిగోటికి పోలదంటే నమ్మమన్నాడు! తనకి కాబోయేవాడికి తనపట్ల అటువంటి అభి ప్రాయం ఉండటం ఎంతైనా మంచిదే లెమ్మను కుంది....వెంటనే తన చెయ్యి పుచ్చుకొని దగ్గ రికి లాక్కోబోయాడు. అప్పుడు తనేంచేసిందో తెలవదుకాని మరుక్షణంలో అతని చెంపమీద ఐదు వ్రేళ్ళు తేలి ఉన్నాయ్....అంతే! అప్పటి నుంచీ అతని దృష్టిలో తనొక శత్రువు. కాని తన దృష్టిలో మట్టుకు అతను....

ప్రభాకరం చిత్రం మనోనేత్రం ముందు స్పష్టంగా కనపడుతుంది భారంగా ఓ నిట్టూర్పు విడుస్తుంది బుజ్జమ్మ....అంతలోనే సూర్యుడస్తమిస్తాడు....అదే క్షణంలో భర్త చేసంచీతో గుమ్మమెక్కబోతూ ఎదురుగుండా కూర్చున్న బుజ్జమ్మని చూచి చిరునవ్వు నవ్వు తాడు. పాపం, బుజ్జమ్మ స్మృతి పథంలో మెదులుతున్నవి అతనికేం తెలుసు? బుజ్జమ్మ గత స్మృతులన్నీ ఒక్కసారిగా చెల్లాచెదురైపోగా వడిలో బిడ్డతో తత్తరపాటుగా లేచి నిలబడి చిరునవ్వుతో స్వాగతమిస్తుంది, తాళి కట్టిన భర్తకి....

కన్న కలలన్నీ నిజమైతే ఇక లేనిదేముంది? కలలు కలలలానే ఉంటాయ్, బ్రతుకులు వెళ్ళ మారిపోతాయ్. అంతే మరి....అనుకోవడంకంటె మరేం కన్పించదు పాపం బుజ్జమ్మకి.